"పాడాలంటే హృదయం ఉండాలి... హృదయానికి ఏదో కదలిక రావాలి..
భావం పొంగాలి.. రాగం పలకాలి.. దానికి జీవం పోయాలి"
(song: పాడాలనే ఉన్నది.. movie: చిల్లర దేవుళ్ళు (1975) Others-1 సెక్షన్)

చిమటమ్యూజిక్.కామ్ వెబ్ సైట్ మొదటి వసంతాన్ని పూర్తి చేసుకుంటున్న తరుణాన ఈ వెబ్ సైట్ ను మనస్ఫూర్తిగా ఆదరిస్తున్న మీ అందరికి మా హృదయ పూర్వక ధన్యవాదాలు. ఈ శుభ సమయంలో నా మనసులోని కొన్ని భావాలను మీతో పంచుకోవాలని ఉంది.

గత పది సంవత్సరాలుగా అమెరికాలో ఉంటున్న నాకు మొదట నుండి మన తెలుగు భాష, తెలుగు సినిమాలు, తెలుగు పాటలు అంటే వల్లమాలిన అభిమానం. గ్రామీణ నేపథ్యంలో పుట్టి పెరిగిన నేను రేడియో లో ఎప్పుడూ వచ్చే 70, 80 వ దశకాల లోని తెలుగు పాటలంటే చెవి కోసుకునేవాడిని. ఈ పాటలు వింటున్న ప్రతిసారి నా బాల్య స్మృతులు, స్కూలు రోజులు గుర్తుకు వస్తాయి. నా దృష్టిలో "గుప్తుల కాలం నాటి స్వర్ణ యుగపు రోజులు" అంటే అవే మరి.

నేను ఎమ్మెస్ చేసున్న రోజుల్లో (1997), గాదిరాజు బాలాజీ గారు "వారం వారం ఒక తెలుగు పాట" అనే శీర్షికతో తెలుగు పాటలను నెట్ మీద వినిపించేవారు. క్యూపర్టినోలో ఉంటున్న ఆయనకు నా అభినందనలు తెలియచేస్తూ, ఆ పాటల గురిచి చర్చించు కొనేవాళ్ళం. ఆ తర్వాత క్రమ క్రమంగా నల్లా.కామ్, చంద్రలేఖ.కామ్, శితారాం.కామ్, మెగాసినిమా.కామ్, తెలుగుబిజ్.కామ్, రమణీయ.కామ్ లాంటి సైట్సు రావడంతో నేను సొంతగా సైట్ పెట్టే ఆలోచనను దాదాపుగా విరమించుకున్నాను. కాని నా హృదయాంతరాలలో ఎక్కడో ఈ సైటులన్నీ 70, 80 వ దశకాల లోని అన్ని మెలోడీ పాటలను పూర్తిగా పొందు పరచడం లేదనే తీవ్రమైన అసంతృప్తి నిక్షిప్తమై ఉంది.

ప్రతి సంవత్సరం మా ప్రాంతం (Silicon Valley) లో జరిగే BATA Picnic Program లో, మా ఇళ్ళళ్ళలో జరిగే funcitons లో మిత్రులతో కలిసి ఈ పాటలను పాడుకునేవాళ్ళం. సెప్టెంబరు 2005 లో నాకు అత్యంత ఇష్టమైన "పాడి పంటలు" పాటలను నెట్ లో వెదకగా పెద్ద నిరాశ ఎదురైంది. ఇలాంటి ఆణిముత్యాల వంటి పాటలను మన తెలుగు వాళ్ళు ఇంత త్వరగా మరచిపోయారంటే నాకు నమ్మశక్యం కాలేదు. ఒక్కసారి ఆలోచించగా నేను మనసు పడే చాలా పాటలు (ముఖ్యంగా 70, 80 వ దశకాల లోనివే) నెట్ లో లేవన్న విషయం అవగతమైంది. ఘంటసాల గారి చాలా పాటలు (60 వ దశకం లోనివి) CD రూపం లో మార్కెట్లో లభ్యమవ్వడం వల్ల, చాలా సైట్లు ఆ పాటలను సేకరించాయి. 70 వ దశకం లోని చాలా మంచి మెలోడీ పాటలు బయట ఆడియో మార్కెట్ లో దొరక్క పోవడం వల్ల బహుశా వాటిని నెట్ లో పెట్టలేక పోతున్నారనే నిర్ధారణకు వచ్చాను.

ఒక రోజు ఆఫీసుకు డ్రైవ్ చేస్తూ నా మిత్రుడు, సురేష్ మంత్రాల కు ఫోను చేసి మనిద్దరికి ఇష్టమైన 70, 80 వ దశకాల తెలుగు మెలోడీ పాటలన్నంటినీ సేకరించి వెబ్ సైట్ లో ఒకచోట చేర్చడానికి కంకణం కట్టుకున్నానని చెప్పాను. తను కూడ ఉత్సాహం చూపించడంతో, అప్పుడే ఒక గంటసేపు సైట్ ని ఎలా కార్యరూపం లోకి తీసుకురావాలా అని తర్జనభర్జనలు పడ్డాము. నేను, సురేష్, నా ఇంకో ప్రాణ స్నేహితుడు- వేణు భాగవతుల కలిసి ఇంజినీరింగ్ రోజుల్లో రాత్రిళ్ళపూట గంటల తరబడి బాలు పాటల మీద చర్చించుకొనేవాళ్ళం. ముఖ్యంగా ఏ పాటలో బాలు ఏ అక్షరాన్ని వత్తి పలికేవాడు, ఎక్కడ మెలిక పెట్టేవాడు, ఏ పదాన్ని గుండెలు కదిలించేలా పాడేవాడు అన్న విషయాల మీద మాట్లాడుకొనేవాళ్ళం. NTR పాటల్లో గాంభీర్యం..కృష్ణ పాటల్లో చలాకీతనం.. శోభన్ బాబు పాటల్లో ఆర్ద్రత.. చిరు పాటల్లో హుషారుతనం.. ఇలా ఇంకెన్నో... ఈ పాటలు ఎన్నిసార్లు విన్నాకానీ, వింటున్న ప్రతిసారీ బాలు స్వరం నుండి అద్భుతంగా ఒలికిన భావాలు నన్ను సదా విస్మయ పరుస్తాయి. నేను అమెరికా వచ్చేటప్పుడు దాదాపుగా 500 పాటలను ఆడియో క్యాసెట్స్ లో రికార్డు చేయించుకొని వచ్చాను. ఆ పాటలన్నింటిని మా మిత్రబృందం తో పంచుకొనేటప్పుడు వాళ్ళు నా పాటల సెలెక్షన్ చాలా బాగుందని కాంప్లిమెంట్స్ ఇచ్చేవారు. మా లాంటి బాలు అభిమానులందరికి ఈ పాటలన్నింటిని ఒక వెబ్ సైట్ ద్వారా అందించాలనే ఒక కృత నిశ్చయం అప్పుడే నాలో కదిలింది. అదీకాక, నెట్ లో అప్పటికే చాలామంది

హిందీ, తమిళ సైట్ లలో దాదాపు అన్ని 70 వ దశకంలోని పాటలను పెట్టడం జరిగింది. మనకి కూడా అలాంటి సైట్స్ ఎందుకు లేవని నాలోని తెలుగు భాషాభిమానం పడ్డ అంతర్మథనమే ఈ సైట్ రూప కల్పనకు నాంది.

స్వోత్కర్ష అనుకోకపోతే.. నాకున్న సినిమా పిచ్చి వల్ల ఏ హీరోకి ఏఏ పాటలు (70, 80 లలో) ఉన్నాయని అడిగితే టక్కున చిట్టా విప్పగలను. సైట్ పెట్టాలి అనుకున్న తడవుగా నాకు నచ్చినవి, గుర్తున్నవి అన్నీ ఎప్పటికప్పుడు లిస్ట్ చేయడం మొదలుపెట్టాను. మా కజిన్, రుద్రనాథబాబు మొవ్వ నాకు 70 వ దశకంలోని పాటల విషయంలో నేను మరచిపోయిన కొన్ని పాటలని గుర్తు చేశాడు. అలా దాదాపుగా 1400 పాటలు మా మస్తిష్కాల నుండి పేపరు మీదకు వచ్చాక, ఆ లిస్ట్ ని మా తమ్ముడు చిట్టిబాబు (చిలకలూరిపేట) కు పంపించాను. వాడు, మా కజిన్, రమేష్ విన్నకోట సహాయంతో దొరికిన పాటలన్నింటిని రికార్డు చేయించి, వాటిని .mp3 files గా మార్పించి నాకు పంపడం మొదలు పెట్టారు. ఈలోపు ఇక్కడ నేను వెబ్ సైట్ సెటప్ చెయ్యడంలో నిమగ్నమయ్యాను. ఇనీషియల్ సెటప్ లో రమేష్ వడలి (AndhraKitchen.com) గారి సహాయం మరువలేనిది.

దాదాపుగా 10 సంవత్సరాల క్రితం గుంటూరు జిల్లా ఆడియో సెంటర్లలో దొరికిన పాటలు (ఎంతో రసికుడు దేవుడు, నీలో విరిసిన అందాలన్ని, సన్నాయి రాగానికి, ఈ గీతం..సంగీతం etc) ఇప్పుడు భూతద్దం పెట్టి వెదికినా దొరకడం లేదు. ఇలాంటి పాటలు ఇంకో 200 దాకా మిగిలిపోయాయి. ఈ పాటలన్నింటిని ఎలా సేకరించాలని మథనపడుతున్న సమయంలో (ఏప్రిల్ 2006) లో సూర్య గూడూరు (విజయవాడ) గారి నుండి నాకు ఒక అభినందన పూర్వకమైన ఈ-మెయిల్ వచ్చింది. ఆయన కూడా నాలాగే సంగీత దర్శకుడు, సత్యం గారి వీరాభిమాని. పరిచయమైన మొదటివారంలో చాలాసేపు 70 వ దశకం లోని పాటల మీద, సంగీత దర్శకుల బాణీల మీద గంటల తరబడి చర్చించుకునేవాళ్ళం. మా ఇద్దరికీ చాలా విషయాల్లో సారూప్యత ఉంది- ఇద్దరం ఇంటరు ఒకే కాలేజిలో, ఒకే సెక్షనులో చదివాము (తొమ్మిది సంవత్సరాల అంతరంతో).. తెలుగు, హిందీ పాటలలో ఇద్దరిది దాదాపుగా ఒకే అభిరుచి.. ఇద్దరి బాల్యం పెదనాన్నల దగ్గరే గడిచింది.. మా ఇద్దరి పదప్రయోగాలు, సినిమా నాలెడ్జి, జోక్స్ ఒకే లెవెల్లో ఉండేవి. సూర్య గారు నాకు కావాలసిన 200 పాటలను తన సోర్సులను ఉపయోగించి ఒక నెల వ్యవధిలో సంపాదించారు. అంతకు ముందు వరకు సైట్లో ఉన్న * మార్క్ సాంగ్స్ (అప్పటికి సైట్లో అందుబాటులో లేనివి) ఆయన పరిచయం అయిన తరువాత మంత్రం వేసినట్టుగా మాయమయ్యాయి :-) ఇంకో విషయం ఏమిటంటే, నేను కొన్ని పాటలు కోరితే వాటితో పాటుగా నేను మరిచిపోయినవి, నాకు తెలియనివి పంపేవారు. ఇప్పటి వరకు 500 పాటల పైగా సూర్య గారు ఎలాంటి ప్రతిఫలాపేక్షను ఆశించకుండా సైట్ కు అందించారు. సూర్య గారు ఈ పాటల వెనక ఉన్న మహానుభావులందరిని మరచిపోకూడదని, ఇంకా like-minded people చాలా మంది సైట్ కు వచ్చి ఈ పాటల మీద తమకు తెలిసిన విషయాలను చర్చించుకోవాలనే ఒక సదుద్దేశంతో Discussion Board కు నాంది పలికారు. సూర్య కొండపల్లి, శ్రీనివాస్ చెన్నూరి, జె. మారుతీకుమార్, రవీంద్ర మాగంటి, నిషిగంధ లాంటి మిత్రులు కూడా తమ వంతు ప్రోత్సాహాన్ని సైట్ కు అందిస్తున్నారు.

సైట్ కోసం ఈ పాటలను సేకరిస్తున్నప్పుడు కొన్ని విషయాలు గమనించాను. సత్యం సంగీత దర్శకత్వంలో ఇన్ని మధురమైన పాటలు ఉన్నట్టుగా నాకు ముందు తెలియదు. ఈ 70 వ దశకంలోని యుగళ గీతాలలో 90% దాక సుశీల గారు, బాలు తో పాడారు. ఇళయ రాజా field లోకి వచ్చిన తరువాతే జానకి గారు ఎక్కువ తెలుగు పాటలు పాడినట్టు అనిపిస్తుంది (ముఖ్యంగా 80 వ దశకంలో). 70, 80 లలో బాలు గారు మూడు భాషలలో (తెలుగు, తమిళం, కన్నడ) బాగా బిజీగా వున్నప్పటికీ, క్వాలిటీ ఎంతమాత్రం తగ్గకుండా ఎంత అలవోకగా ఈ పాటలన్నీ పాడారో కదా అనిపిస్తుంది.

గత ఆరు నెలలుగా సైట్ కి ట్రాఫిక్ బాగా పెరిగి చాలా మంది like-minded folks తమ అభినందనలను, వారికి ఇష్టమైన పాత పాటలను గెస్ట్ బుక్ లో రాయడం మొదలు పెట్టారు. వీరందరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాము. నెలకు 100 మంది తో మొదలయ్యిన unique visitors సంఖ్య ఈ రోజు దాదాపుగా 20,000 కు పైగా చేరుకుంది. 70, 80 వ దశకాల లోని పాటలను సజీవంగా ఉంచాలనే నేను చేస్తున్న ఈ చిన్ని ప్రయత్నం లో

నాకు నైతిక, మానసిక బలాన్ని ఇస్తున్న శ్రోతలందరికి నా వందనాలు.

ఒక్కసారి ఈ గత సంవత్సర కాలంలో సైట్ ద్వారా నాకు లభించిన తీపి గుర్తులను నెమరు వేసుకుంటుంటే ఎనలేని తృప్తి కలుగుతున్నది. ఒకనాటి నా స్వప్నాన్ని సాకారం చేసుకోవడంలో నా సతీమణి (మాధవి), మా పసి పిల్లలు (పూజ, విద్య) అందించిన సహాయ, సహకారాలు వెల కట్టలేనివి. చాలా మంది శ్రేయోభిలాషులు ఈ సైట్ ను కమర్షియల్ చెయ్యకుండా ఎలా నడపగలుగుతున్నారని ఆశ్చర్యం వెలిబుచ్చుతుంటారు. నేను ఈ సైట్ నిర్మాణం వ్యాపార దృష్టితో చేసింది కానేకాదు. నాలో బాలు పట్ల ఉన్న అవ్యాజమైన అభిమానం, మధురమైన పాత తెలుగు పాటల మీద ఉన్న అంతులేని మమకారం, ప్రస్తుత తెలుగు పాటల దయనీయ పరిస్థితి నన్ను ఈ సైట్ సారధ్యానికై పురిగొల్పాయి.

ముగింపు: చంద్రునికో నూలుపోగులాగా ఈ సైట్ ను SP బాలు, P సుశీల, S జానకి గార్లకు; కీర్తిశేషులైన KV మహాదేవన్, పుహళేంది, సత్యం, రమేష్ నాయుడు, చక్రవర్తి గార్లకు అంకితం ఇస్తున్నాను.

జైహింద్!!

శ్రీనివాసరావు చిమట
Fremont, CA
10-31-2006